క్లుప్తంగా

అతిసారంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

ముదిగుబ్బ: అతిసార వ్యాధి నియంత్రణపై శుక్రవారం మలకవేమల పీహెచ్‌సీ పరిధిలోని నాగారెడ్డిపల్లిలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ 5 సంవత్సరాలలోపు పిల్లలలో 50 శాతం మరణాలు నీళ్ల విరేచనాలు, నిమోనియా వల్ల సంభవిస్తున్నాయన్నారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వేణుగోపాల్‌రెడ్డి, సీహెచ్ఓ భార్గవి, ఎంపీహెచ్ఏ హరినాథ్‌రెడ్డి, ఎస్ఏఎన్ఎం కృష్ణవేణి, 104 సిబ్బంది విష్ణు, ఆశా కార్యకర్తలు గంగాదేవి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే కేతిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎంపీపీ త్రివేణి దంపతులు

బత్తలపల్లి: ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేసిన బగ్గిరి త్రివేణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి దంపతులు ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, పెనుగొండ ఎమ్మెల్యే శంకరనారాయణను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం వారు మర్యాదపూర్వకంగా ధర్మవరంలోని ఎమ్మెల్యే కేతిరెడ్డి స్వగృహంలో శాలువ కప్పి, బొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే సతీమణి కేతిరెడ్డి సుప్రియను కూడా శాలువతో సన్మానించారు. అనంతరం పెనుగొండ ఎమ్మెల్యే, శ్రీసత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శంకరనారాయణను కలిసి పూలబొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కమతం ఈశ్వరయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, పోట్లమర్రి సర్పంచు అక్కిం దామోదర్, విద్యార్థి విభాగం నాయకులు నరేంద్రరెడ్డి, నాయకులు బండి వీరనారప్ప, బండి నాగభూషణ, సంద్ర రామకృష్ణ, ముసలప్ప, శింగమనేని వెంకటేష్, బోయపాటి సూరీ తదితరులు ఉన్నారు.

చెన్నరాయస్వామికి ప్రత్యేక పూజలు



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఓడీ చెరువు: మండలంలోని కొక్కంటివారిపల్లిలో వెలసిన చెన్నరాయస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎలవ గంప ఉత్సవంలో భాగంగా మొదటి రోజు ఆలయాన్ని రంగు రంగు పూలతో సుందరంగా అలంకరించారు. ఆలయం ఎదుట వేద పురోహితులు పంచరత్న సురేష్ శర్మ, హర్షవర్ధన్, సంతోష్ తదితరులు గణపతి హోమం, మృత్యుంజయ హోమం, సుదర్శనహోమం, గంగపూజ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. రెండో రోజు శనివారం ఎలువ గంప ఉత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

శుభకార్యం

తాడిమర్రి: మండలంలోని కునుకుంట్ల గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త సాకే రాజప్ప కుమార్తె వివాహం శుక్రవారం గ్రామంలోని యల్లమ్మ దేవాలయంలో జరిగింది. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఈ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వడ్డి లింగారెడ్డి, సల్లాపురం బాలరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కార్పియో బోల్తా.. ఒకరికి గాయాలు



బ్రిడ్జి వద్ద బోల్తా పడిన స్కార్పియో వాహనం

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని కుణుతూరు వద్ద ఉన్న బ్రిడ్జి సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఓ స్కార్పియో వాహనం అదుపు తప్పి రోడ్డుకు అడ్డంగా పడింది. అయితే ప్రమాదంలో వాహన యజమాని సాయి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. కొత్తచెరువుకు చెందిన సాయి పని నిమిత్తం అనంతపురం వెళ్తున్నాడు. మలుపు వద్ద స్కార్పియో అదుపు తప్పి మూడు పల్టీలు కొట్టింది. బ్రిడ్జి వద్ద రోడ్డుకు అడ్డంగా పడింది. మరో అయిదు అడుగులు ముందుకు వెళ్లి ఉంటే బ్రిడ్జిపై నుంచి పడి పెను ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు. వాహన యజమాని స్వల్ప గాయాలతో బయట పడడంతో కుటుంబ సభ్యులు, మిత్రులు ఊపిరి పీల్చుకున్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

నల్లచెరువు: రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి తెలిపారు. నల్లచెరువు సచివాలయం-1 పరిధిలో శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ తిరుగుతూ ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విజయలక్ష్మి కాలనీవాసులు సిమెంట్ కాంక్రీటు రోడ్డు వేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సంబంధిత ఇంజినీరింగ్ అసిస్టెంట్‌తో మాట్లాడి ఎస్టిమేట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామంలో పలు చోట్ల కరెంటు పోల్స్, డ్రైనేజీలను ఏర్పాటు చేయాలని కోరగా, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాల వ్యవస్థ తీసుకొచ్చి అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుని ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. జగనన్న ప్రభుత్వంపై ప్రజలు చూపుతున్న ఆదరణను చూసి ఓర్వలేని చంద్రబాబు ఎల్లో మీడియాను అడ్డు పెట్టుకొని ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమం చేపడుతున్నాడని విమర్శించారు. ఆయనకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు మరోమారు బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో మాజీ సమన్వయకర్త ఎస్ఎండీ ఇస్మాయిల్, ఎంపీపీ కె.రమణారెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణ స్వామి, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ భాగ్యమ్మ, సర్పంచులు పంచ రత్నమ్మ, శ్రీనాథ్‌రెడ్డి, యూసుఫ్, ఎంపీటీసీలు సుమియా, భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నాగభూషణ, సింగల్ విండో అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, అగ్రి అడ్వైజరి బోర్డు చైర్మన్ ముస్తఫా, డైరెక్టర్ ఆదిమూర్తి, టెంపుల్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ చైర్మన్ ఆనంద్‌రెడ్డి, మాజీ సర్పంచులు నరసిహారెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యుడు షెక్షావలిఖాన్, జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్, నాయకులు డాక్టర్ శంకర్, బట్టీ హైదర్ వలి, వెంకటరెడ్డి, రఫి, నజీర్, పెద్ద మౌలాలి కె.రమణారెడ్డి, సానే హరినాథ్‌రెడ్డి, సమీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ బాధ్యతల స్వీకరణ



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి



గజమాలతో ఎమ్మెల్యే కేతిరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: ధర్మవరం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కాచర్ల లక్ష్మి శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు శివానగర్ శివాలయంలో తన భర్త కాచర్ల అంజితో కలిసి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మున్సిపల్ కార్యాలయం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. ఆయనను గజమాలతో నూతన చైర్‌పర్సన్ సన్మానించారు. ర్యాలీలో కేరళ వాయిద్య కళాకారుల డప్పు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు యర్రగుంట్ల భాగ్యలక్ష్మి, పెనుజూరు నాగరాజు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్'తో మెరుగైన వైద్యం



గ్రామస్తులను పరీక్షిస్తున్న డాక్టర్ జ్యోతిర్మయి

తాడిమర్రి: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంతో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని డాక్టర్ జ్యోతిర్మయి పేర్కొన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె తురకవారిపల్లి గ్రామంలో 104 వాహన సిబ్బంది, వైద్య సిబ్బందితో కలసి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు, గర్భిణులు, బాలింతలకు బీపీ, షుగర్, రక్త, మూత్ర పరీక్షలు చేశారు. అనంతరం ఆమె సిబ్బందితో కలసి గ్రామంలో జబ్బుచేసి మంచం పట్టిన రోగులకు వైద్య చికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

తాడిమర్రి: సీఎం జగన్‌కు రుణపడి ఉంటామని ఆరోగ్య కార్యకర్తలు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాంట్రాక్టుపై పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో వారు ధర్మవరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకుడు మాధవరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిని కలిసి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో హర్షవర్ధన్‌రెడ్డి, జానకీరామ్, శ్రీనివాసులు, బ్రంహ్మానందరెడ్డి, తిరుపాల్ తదితర ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

'వైఎస్సార్ బీమా'పై అవగాహన

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాళసముద్రంలో శుక్రవారం ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీ అంజనప్ప 'వైఎస్సార్ బీమా'పై ప్రజలకు అవగాహన కల్పించారు. 18 నుంచి 70 ఏళ్ల లోపు ఉన్న వారికి బీమా వర్తిస్తుందన్నారు. 18 ఏళ్ల నుంచి 50 ఏళ్లలోపు వారు సహజ మరణం పొందితే రూ.లక్ష, 70 ఏళ్లలోపు వారు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 5 లక్షల బీమా వర్తిందన్నారు. ఈ నెల 10 లోపు వలంటీర్లు సర్వే నిర్వహించి బీమా చేయాల్సిందిగా ఆదేశించారు. కదిరి మండలంలో మొత్తం 11,850 కార్డులు ఉండగా ఇప్పటివరకు 7,918 కార్డుదారులకు సర్వే పూర్తయిందన్నారు.

11న ప్రవేశ పరీక్ష

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం జగరాజుపల్లి మోడల్‌స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 11న పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రమేష్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీఎంఎస్ వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ ఉంటుందన్నారు. 30 నిమిషాలు ముందే హాజరు కావాలన్నారు.

రీ సర్వే వేగవంతం చేయండి

ముదిగుబ్బ: రీ సర్వే పనులు వేగవంతం చేయాలని జిల్లా సర్వే అధికారి కృపాకర్ సూచించారు. శుక్రవారం మండలంలోని బీడిమర్రి, ఉప్పలపాడులో జరుగుతున్న రీసర్వే పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ధర్మవరం డిప్యూటీ సర్వే ఇన్‌స్పెక్టర్ మురళీతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో సర్వే అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను వేగవంతం చేయడంతో పాటు రికార్డులు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. మండల వ్యాప్తంగా రైతుల భూ సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్లు శివశంకర్ నాయక్, దామోదర్, సచివాలయ సర్వేయర్లు తదితరులు ఉన్నారు.

పోస్టర్ల విడుదల

తలుపుల: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ప్రోత్సాహక పథకాల పోస్టర్లను శుక్రవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల అగ్రి బోర్డు చైర్మన్ చెన్నక్రిష్టారెడ్డి, ఏఓ షాదాబ్ విడుదల చేశారు. మల్బరీ సాగులో వివిధ రకాల ప్రోత్సాహకాలపై రైతుల్లో అవగాహన పెంచాలని వ్యవసాయ సహాయకులకు సూచించారు. ఏఈఓ రహంతుల్లా, వ్యవసాయ సహాయకులు యాసిన్, రామాంజులు, ఇర్ఫాన్, సర్ధాజ్, బేబీ, నిఖిల్, రాజేష్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న డాక్టర్ మహేంద్రనాథ్

తాడిమర్రి: పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వైద్యాధికారి మహేంద్రనాథ్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆయన హైరిస్కు గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. పలువురికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, చేపలు, గుడ్లు, మాంసం తదితర ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయించుకోవడం, ఉదయం సాయంత్రం కాలినడక చేయాలన్నారు. కాన్పు కోసం 108 వాహనం ఉపయోగించుకుని, ప్రభుత్వాసుపత్రికి వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ మనోహర్‌బాబు, పీహెచ్ఎన్ కళావతి, ఏఎన్ఎంలు, ఆశా కర్యకర్తలు, గర్భిణులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓడీ చెరువు: గర్భిణులు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని డాక్టర్ భానుప్రకాష్ నాయక్ అన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ వందన కార్యక్రమం నిర్వహించారు. 51 మంది గర్భిణులకు డాక్టర్ భానుప్రకాష్‌నాయక్ పరీక్షలు చేసి సూచనలు, సలహాలు అందజేశారు. 14 మందిని హైరిస్కుగా గుర్తించినట్లు చెప్పారు. వైద్య పరీక్షలకు విచ్చేసిన గర్భిణులకు రాధిక థియేటర్ యజమాని కటికల సతీష్‌కుమార్ భోజన సదుపాయం కల్పించగా, ఎస్ఐ గోపి భోజనం వడ్డించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లోకేష్‌రెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షులు రంజిత్,సీహెచ్ఓ సుభాషిణి,పీహెచ్ఎన్ దిల్‌షాద్, ఎంపీహెచ్ఈఓలు గోపినాయక్, లాలూనాయక్, సూపర్‌వైజర్లు విజయకుమారి, లక్ష్మినరసమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

తలుపుల: మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం 57 మంది గర్భిణులకు వైద్యాధికారులు మున్వర్‌బాష, సల్మా వైద్య పరీక్షలు చేశారు. 12 మందిని రక్తహీనత కలవారిగా గుర్తించి ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్ వేశారు.16 మందిని అల్ట్రా సౌండ్ స్కానింగ్‌కు కదిరికి పంపారు. ఉపాధ్యాయుడు గంగిశెట్టి భోజన సదుపాయం కల్పించారు.

త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలి



కేఎస్ పాళ్యంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ తిప్పేనాయక్

కొత్తచెరువు: వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మించుకోవాలని ఆర్‌డీఓ భాగ్యరేఖ అన్నారు. స్థానిక కొత్త చెరువు- ధర్మవరం రహదారిలోని జగనన్న కాలనీని శుక్రవారం ఆర్‌డీఓ పరిశీలించారు. ఇప్పటి వరకూ ఎన్ని నిర్మాణాలు పూర్తయ్యాయి, పూర్తి కానివి ఎన్ని ఉన్నాయి అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరగా నిర్మించుకునే విధంగా చైతన్య పరచాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రమణారెడ్డి, వీఆర్ఓ శీన, సిబ్బంది పాల్గొన్నారు.

కనగానపల్లి: జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న పేదల ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయించాలని ధర్మవరం ఆర్డీఓ తిప్పేనాయక్ మండల అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని కేఎస్ పాళ్యంలో ఆయన పర్యటించారు. స్థానిక జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయించాలని ప్రభుత్వం లక్ష్యం ఉందన్నారు. కేఎస్ పాళ్యం జగనన్న కాలనీ కింద మంజూరైన 110 ఇళ్లను త్వరగా పూర్తి చేయించాలని హౌసింగ్, రెవెన్యూ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి చిట్టెమ్మ, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ లక్ష్మయ్యకు అవార్డు



లక్ష్మయ్యకు అవార్డును అందిస్తున్న దృశ్యం

బత్తలపల్లి: పౌరాణిక నాటక రంగంలో రాణిస్తున్న బత్తలపల్లి పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మయ్యకు అవార్డు లభించింది. హంపిలోని శ్రీకృష్ణదేవరాయ నృత్యోత్సవం నిర్వాహకులు శుక్రవారం ఆయనకు అవార్డు అందజేశారు. 30 సంవత్సరాలుగా లక్ష్మయ్య పౌరాణిక నాటక రంగంలో రాణిస్తున్నారు. ప్రజలను చైతన్యపరచేందుకు పోలీసు శాఖ చేపట్టిన కళాజాతాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఈ క్రమంలోనే ఆయన ప్రతిభను గుర్తించిన సిటిజన్ వెల్ఫేర్ ఫోరం, ఫ్రైడ్ ఇండియా కల్చర్ నిర్వాహకులు అవార్డు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్యను సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ టీవీ శ్రీహర్ష, పోలీస్ సిబ్బంది అభినందించారు.

అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శివనారాయణ రావు

తనకల్లు: అతిసార వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివనారాయణరావు అన్నారు. మండల పరిధిలోని బాలసముద్రంలో శుక్రవారం 'ఉధృత అతిసార వ్యాధి నియంత్రణ' పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల లోపు చిన్నారులలో అతిసారా వ్యాధి వల్ల మరణాలు ఎక్కువగా జరుగుతున్నట్లు తెలిపారు. మరణాలను పూర్తిగా తగ్గించడానికి ఆశా, ఆరోగ్య కార్యకర్తలతో ఇంటింటా సర్వే చేపట్టి అతిసారా లక్షణాలున్న పిల్లలను గుర్తించాలన్నారు. లక్షణాలున్న చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను అందజేసి పీహెచ్‌సీకి రెఫర్ చేయాలని పేర్కొన్నారు. తల్లులు, పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం, ఓఆర్ఎస్ ద్రావణం ఇంటి దగ్గరే తయారు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, ఆరోగ్య సిబ్బంది షాఫియా, షబ్బీర్, ఎంఎల్‌హెచ్ఓ మమత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విత్తన కాయలు సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సత్యనారాయణ

ఓడీ చెరువు: రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో అందించే విత్తన వేరుశన కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు సత్యనారాయణ, అగ్రి అడ్వైజరీ బోర్డు మండల చైర్మన్ లక్ష్మిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆర్బీకేలో శుక్రవారం మండల అగ్రిబోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి అధ్యక్షతన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో నాణ్యమైన విత్తన కాయలు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. రైతులు ఆర్బీకేల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. పొలాల్లో లోదుక్కులు చేసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ఏడు సాళ్లకు ఒక సాలు కందిని తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఇలియజ్ అహమ్మద్, సెరికల్చర్ టెక్నికల్ ఆఫీసర్ చంద్రశేఖర్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



మాట్లాడుతున్న కోటి సూర్యప్రకాష్‌బాబు

బత్తలపల్లి: మంచి నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, జెడ్పీటీసీ కోటి సుధ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వినాయక నగర్, స్టేట్ బ్యాంకు దగ్గర, అనంతరూరల్ స్కూల్ ఏరియాలలో నీటి కుళాయిలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. నీటిని వృథా చేస్తే మరొకరికి అందకుండా పోవడం, నీరు నిల్వ ఉండి మురుగు ఏర్పడుతుందన్నారు. ప్రశాంతంగా ఉండి నీటిని పట్టుకోవాలని సూచించారు. గ్రామంలో అందరికీ నీరు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహిద్దాం



మాట్లాడుతున్న జిల్లా అగ్రీ అద్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి



మాట్లాడుతున్న వెంకటరాముడు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి డివిజన్‌లో చిరుధాన్యాల సాగును ప్రోత్సహిద్దామని జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తి వ్యవసాయశాఖ కార్యాలయంలో వ్యవసాయాధికారులు, ఆర్‌బీకే సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పెద్ద ఎత్తున చిరుధాన్యాలు సాగు చేసి రాష్ట్రంలో మొదటి స్థానం సాధించాలన్నారు. ఆర్‌బీకేల ద్వారా వేరుశనగ విత్తనకాయలతో పాటు రాగులు, పెసలు, పంపిణీ చేస్తున్నారన్నారు. ఏ పంట సాగు చేసినా ఈ క్రాప్ బుకింగ్, జియో ట్యాగింగ్ చేయించాలన్నారు. జిల్లాకు 350 క్వింటాళ్ల వరకూ రాగులు అందజేస్తారన్నారు. ఎర పంటలు, పొలంబడి, సరిహద్దు పంటలపై అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, మండల అగ్రీ బోర్డు చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, ఏఓ వెంకటబ్రహ్మం, హెచ్ఓ నవీన్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి: చిరు ధాన్యాల పంటలు సాగు చేసే రైతులను ప్రోత్సహిద్దామని మండల అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ వెంకటరాముడు తెలిపారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండల అగ్రీ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరు ధాన్యాల పంటల సాగు, ముఖ్యంగా రాగి పంట సాగుపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ కృష్ణకుమారి మాట్లాడుతూ వచ్చే ఖరీఫ్‌లో చిరుధాన్యాల పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తున్నాయన్నారు. రాగి పంట సాగుచేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు అందించటంతో పాటు రాగి ధాన్యానికి రూ.3,750 మద్దతు ధరను ప్రకటించిదన్నారు. సమావేశంలో దృశ్య కళల అకాడమీ స్టేట్ డైరెక్టర్ ప్రభాకర్, మండల అగ్రీ బోర్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని హౌసింగ్ బోర్డు ఎల్ఐజీ కాలనీలో గాడ్ జనరల్ స్టోర్‌లో ఉన్న భాగ్యలక్ష్మి అనే మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి లాక్కొని ద్విచక్ర వాహనంపై ఉడాయించాడు. ఈఘటనపై శుక్రవారం మధ్యాహ్నం స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకున్నారు. జిల్లా కేంద్రంలో ఇప్పటి దాకా పదుల సంఖ్యలో స్నాచింగ్‌లు జరిగాయి. ఒక్క స్నాచర్‌ను పోలీసులు గుర్తించలేక పోయారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముదిగుబ్బ: మండలవ్యాప్తంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కుటాగుళ్ల 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ తర్వాత యథావిధిగా కరెంటు సరఫరా మొదలవుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ధర్మవరం: పోతులనాగేపల్లి లేఔట్ సబ్‌స్టేషన్ వద్ద నిర్మించనున్న శ్రీ ఈశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర, విఘ్నేశ్వర స్వాముల ఆలయ నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి భూమి పూజ చేశారు. విశ్రాంత ఎంఈఓ చిన్నపరెడ్డి, గండికోట రాఘవరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఆలయ నిర్మాణ పనుల ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై శంకుస్థాపన చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కదిరి: కుటాగుళ్ల వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తనకల్లు మండలం ఎగువ తొట్లిపల్లికి చెందిన కుంచపు మోహన్‌కుమార్ (23) దుర్మరణం పాలయ్యాడు. పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. టమాట మండిలో మేనేజర్‌గా పనిచేసే మోహన్‌కుమార్ స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంలో కదిరికి వచ్చాడు. తర్వాత అనంతపురం వైపు వెళుతుండగా కుటాగుళ్ల వద్ద ఎదురుగా వస్తున్న సుమో వాహనాన్ని తప్పించబోయాడు. అదే సమయంలో కుడివైపు నుంచి ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన లారీని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. హెల్మెట్‌లో హెడ్‌ఫోన్స్ పెట్టుకొని సెల్‌లో మాట్లాడుతూ నడపడంతోనే ప్రమాదం జరిగిందని పోలీసులు పేర్కొన్నారు. మృతుని జేబులో ఉన్న ద్విచక్ర వాహనం ఆర్‌సీ ద్వారా వివరాలు కనుక్కోగలిగామని, మృతుని తండ్రి కేశవకు వెంటనే ఫోన్ ద్వారా ఈ విషయం తెలియజేశామన్నారు.